సాక్షి
నిజామాబాద్
సోమవారం ꠰ 9 ꠰ జనవరి ꠰ 2023



జోరుగా భవన నిర్మాణాలు
నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి.
- 10లో ▸



మాతృభూమిపై మమకారంతో..
ఉపాధి కోసం, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లినవారు.. సొంత గడ్డకు సేవ చేయడానికి ముందుకు వస్తున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.0 /14.3

వాతావరణం
పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గవచ్చు.

న్యూస్‌రీల్

పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు

- 14.3 డిగ్రీల సెల్సియస్ నమోదు

సుభాష్‌నగర్: జిల్లాలో గత మూడు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఆదివారం ఏకంగా 14.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. మూడు రోజులుగా చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం 9 తర్వాత, సాయంత్రం 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటికి వెళ్లలేకపోతున్నారు. మరో రెండు రోజుల పాటు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశముందని వారు పేర్కొన్నారు.

బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలి



వేల్పూర్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా 2009 బ్యాచ్ సీఐలు, ఎస్సైలు పేర్కొన్నారు. ఆదివారం వేల్పూర్‌లో కన్న ఊరు కార్యక్రమంలో భాగంగా మండల గ్రామాలకు చెందిన 40 మంది పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తాము చదువుకున్న రోజుల్లో సొంత గ్రామాల నుంచి కాలినడకన హైస్కూళ్లు ఉన్న గ్రామాలకు వెళ్లి చదువుకున్నామన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు చాలా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని ఉపయోగించుకొని మా కన్నా ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. చదువుల్లో ప్రతిభ గల పేద విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. వేల్పూర్ సర్పంచ్ తీగెల రాధామోహన్, ఎంఈవో వనజ, వేల్పూర్, మోతె, పచ్చలనడ్కుడ హైస్కూళ్ల హెచ్‌ఎంలు రాజన్న, లింగన్న, సురేష్, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు గంట అశోక్, ఇతర ఉపాధ్యాయులను సన్మానించారు.

ఎస్కేప్ గేట్ల ద్వారా నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సదర్‌మట్ ఆయకట్టు కోసం ఆదివారం ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను చేపట్టారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3,625 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 272 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 27 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల ద్వారా 450 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 398 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1089.40 అడుగుల(75.46 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

అలరించిన కళోత్సవం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి సనాతన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో కళోత్సవం నిర్వహించారు. తెలంగాణ కళా వైభవం, బాల నాట్య ఉత్సవాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 150 మంది కళాకారులు పాల్గొని తమ నృత్యప్రదర్శనలు ఇచ్చారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలవత్ పూర్ణ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు మాలోత్ నవీన్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందు ప్రియ, పీఆర్టీయూ(టి) జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'మాస్టర్ ప్లాన్'పై స్పష్టత ఇవ్వండి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ మాస్టర్ ప్లాన్ రద్దుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కామారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. ముసాయిదా విషయంలో డీటీసీపీ, డీడీఎఫ్ సంస్థ తప్పిదమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చెబుతున్నారని, 5వ తేదీన రైతులు ఇంటికి వస్తే ఎందుకు సమాధానం ఇవ్వలేదని ప్రశ్నించారు. మున్సిపల్ నిబంధనల ప్రకారమే మాస్టర్ ప్లాన్ చేశారని కలెక్టర్ చెబుతుండగా.. కౌన్సిల్ తీర్మానం మేరకు కాకుండా డీటీసీపీ, డీడీఎఫ్ సంస్థ తప్పిదమని ప్రభుత్వ విప్ పేర్కొంటున్నారని విమర్శించారు.

ఆధ్యాత్మిక వైభవం



ధనుర్మాస ఉత్సవాల నేపథ్యంలో రామాలయానికి దీపాలంకరణ



ముక్కోటి ఏకాదశి రోజు శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు (ఫైల్)

- సుభాష్‌నగర్ శ్రీరామాలయంలో కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు
- దాతల సహకారంతో నిరంతరం కార్యక్రమాలు
- ఆలయంలో ఆకట్టుకుంటున్న తులసీ వనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరులోని సుభాష్‌నగర్ శ్రీరామాలయం ఆధ్యాత్మిక వైభవాన్ని పంచుతోంది. ఆలయంలో ప్రస్తుతం ధనుర్మాస ఉత్సవాలు భక్తిప్రపత్తులతో కొనసాగుతున్నాయి. ఆలయంలో 36 ఏళ్ల నుంచి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని 1986 ఏప్రిల్ 14న త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రారంభించారు. ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ స్వాములతో పాటు ఆంజనేయుడు, గరుత్మంతుడు, లక్ష్మీదేవి, గోదాదేవి మూలవిరాట్టులు ఉన్నాయి. ఆలయంలో ప్రస్తుతం ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 14న 'శ్రీ గోదారంగనాయక కల్యాణం' నిర్వహించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం తిరుప్పావై పేరిట ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ధనుర్మాస ఉత్సవాలతో పాటు కార్తీకమాసంలో ప్రత్యేకంగా నెల రోజుల పాటు బృందావన పూజలు(తులసి పూజలు) చేస్తున్నారు. దసరా ఉత్సవాలతో పాటు పది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. అదే విధంగా హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా చేస్తున్నారు. ఇక శ్రీరామనవమి సమయంలో పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీరాముడి రథోత్సవంతో పాటు పట్టాభిషేకం కార్యక్రమాలు చేస్తారు. ఇక ప్రతినెలా శ్రీ సీతారాములకు 'పునర్వసు కల్యాణం' నిర్వహిస్తున్నారు. అదేవిధంగా వైకుంఠ ఏకాదశికి ముక్కోటి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు.



ఆలయంలోని మూలవిరాట్టులు

తులసి, పూల వనాలు..

ఆలయంలో కార్తీకమాసంలో బృందావన పూజ (తులసి పూజ)లు నెలరోజుల పాటు చేయడం విశేషం. ఇందుకోసం అవసరమయ్యే తులసి కోసం ఆలయ ప్రాంగణంలోనే తులసి వనాన్ని నిర్వహిస్తున్నారు. తులసి వనంతో పాటు ఆలయంలో పూజలకు అవసరమైన పూలకోసం తోటను పెంచుతున్నారు. ఇక ఆలయంలో విష్ణు స్వరూపంగా భావించే రావి చెట్టు, లక్ష్మీదేవి స్వరూపంగా భావించే జమ్మిచెట్టు, శివుని స్వరూపంగా భావించే ఉసిరి చెట్టు ఉన్నాయి. భక్తులు వీటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు.



❝ సమష్టి బాధ్యతతో..



ఆలయంలో అన్ని సేవలు దాతల సహకారంతో క్రమపద్ధతి ప్రకారం నిర్వహించడం జరుగుతోంది. కార్యవర్గ సభ్యులందరూ సమష్టి బాధ్యతతో వ్యవహరిస్తున్నారు. ఆలయంలో ప్రసాదం, రోజువారి పుష్ప కైంకర్యం, ధనుర్మాస ప్రసాదం కోసం దొప్పలు, దీపోత్సవం, ఆహ్వాన పత్రికలు, వస్త్రాలకు సంబంధించి 42మంది దాతల కుటుంబాలు నిరంతరం ఇస్తున్నాయి. దాతలు, తర్వాత వారి వారసులు క్రమం తప్పకుండా ఆనవాయితీని కొనసాగిస్తూ వస్తుండడం చెప్పుకోదగింది.

– పి.శంకర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు

రౌడీషీటర్ల ఐక్యతా రాగం..!

- ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం
- సఖ్యత కోసం మంతనాలు
- ఒకరిపైఒకరు దాడులు చేసుకోవద్దని నిర్ణయం
- ఏదైనా సమానంగా పంచుకోవాలని అంగీకారం

ఖలీల్‌వాడి : రౌడీషీటర్లు ఐక్యమత్యంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నగరంలో గత ఆదివారం పుట్టిన రోజు వేడుకల్లో రౌడీషీటర్ ఇబ్రహీం చావుస్ (29)ను రౌడీషీటర్లు హతమార్చిన విషయం విదితమే. ఈ హత్యకు ప్రధానకారణం పీడీఎస్ బియ్యం, భూ తగాదాల్లో వచ్చిన పంపకాలతోనే జరిగిందని పోలీసులు చెబుతున్నారు. దీంతో ఇల్లీగల్ దందాపై పోలీసు కమిషనర్ నాగరాజు సీరియస్‌గా దృష్టి సారించారు. అంతేకాకుండా ఇబ్రహీం హత్య కేసు లో 12 మంది నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు పరారీలో ఉన్నారు. పోలీసుల రియాక్షన్‌తో రౌడీషీటర్లు తమకు ఇబ్బందులు తప్పవని భావించారు. తమ దందా దెబ్బతింటుందని.. విభేదాలు తొలగించుకుని ముందుకుసాగేందుకు రెండు పార్టీలకు చెందిన నేతలను ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో రౌడీషీటర్ల మధ్య విభేదాలు రాకుండా ఉండేందుకు సదరు నేతలు రంగంలోకి దిగారు. రౌడీషీటర్ల మధ్య సఖ్యత కోసం వారితో మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రోజుల క్రితం నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముగ్గురు రౌడీషీటర్ల అనుచరుల సమావేశం జరిగింది. దీని వెనుక రెండు పార్టీలకు చెందిన నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. సమావేశంలో భూ వివాదాలు, పీడీఎస్ బియ్యం, గంజాయివంటి వాటిలో వచ్చిన లాభాలు, మా ముళ్లను అందరూ సమానంగా పంచుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవద్దని, ఒకరు వెళ్లిన పనులకు మరోవర్గం వెళ్లకుండా ఉండాలని చెప్పుకున్నట్లు తెలిసింది. ఎక్కడ ఏ పనులు చేస్తున్నామో సమాచారం ఒకరికొకరు ఇచ్చుకొని ముందుకు వెళ్లాలని, వచ్చిన ఆదాయాన్ని ముగ్గురు సమానంగా పంచుకోవాలని ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. దీంతో వివాదాలు రాకుండా ఉంటాయని, పోలీసుల దృష్టి ఉండకుండా ఉంటుందని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. సమావేశంలో చర్చించిన నిర్ణయాలపై అందరూ సమ్మతించడంతో అందరూ కలిసి విందు భోజనం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. ఇబ్రహీం హత్య తర్వాత పోలీసులు ఇల్లీగల్ దందాలు, రౌడీ షీటర్లపై దృష్టి సారించడంతో ఎలాంటి గొడవలు లేక పోవడంతో అక్కడి ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. రౌడీషీటర్ల సమావేశం అనంతరం వారి కదలికలు మళ్లీ ప్రారంభం కావడంతో ఇబ్బందులు తప్పడం లేవని, దీనిపై పోలీసులు దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

నిఖత్‌కు కాంగ్రెస్ నేతల అభినందనలు



నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పీసీసీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని నిజాం క్లబ్‌లో బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు అభినందన సభ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు నిఖత్‌కు సన్మానం చేశారు. కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడోను విజయవంతం చేయాలి



హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- గ్రామాల్లో జెండా ఎగురవేయాలి
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ : జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రజలతో కలిసి వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్లడానికి నిర్వహించే హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డీసీసీ డెలిగేట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలతో కలిసి వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్లడానికి హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జనవరి 26 నుంచి రెండు నెలల పాటు కాంగ్రెస్ నాయకులు గ్రామగ్రామాన పాదయాత్రలు నిర్వహిస్తూ, జెండా ఎగురవేస్తూ గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత చేయబోయే పనులను ప్రజలకు వివరిస్తామన్నారు. జనవరి 10న బ్లాక్‌స్థాయిలో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం సమావేశాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ మాట్లాడుతూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఉత్సాహవంతులైన కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టి జైలులో పెట్టిస్తే కిందిస్థాయి కార్యకర్తలు భయపడుతారని తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. అయినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భయపడకుండా ఎదుర్కోవడం అభినందించదగ్గ విషయమన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అణిచివేసేందుకు బీజేపీ, టీఆర్‌ఎస్‌లు తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నాయన్నారు. అయినా భయపడేది లేదని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రతిపక్షాల గొంతునొక్కుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజ నరేందర్ గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణు రాజ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ, ప్రచార కమిటీ చైర్మన్ జావిద్ అక్రమ్, నిజామాబాద్ అర్బన్ బ్లాక్ ఏ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ మహేశ్, బ్లాక్ బి అధ్యక్షుడు అబుద్ బిన్ హందాన్ పాల్గొన్నారు.

బడులకు సమకూరనున్న హంగులు

- 'పీఎంశ్రీ' యోజనకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో 265 ప్రతిపాదిత పాఠశాలలు
- ప్రతి మండలం నుంచి రెండు ఎంపికయ్యే అవకాశం



పచ్చల నడ్కుడ ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న మండల పరిశీలన బృందం

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకంలో భాగంగా ప్రతి మండలం నుంచి రెండు చొప్పున పాఠశాలను ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే ప్రతిపాదిత పాఠశాలలను ఎంపిక చేసి వాటి నుంచి మౌలిక వసతుల అంశాలను నివేదిక రూపంలో తీసుకున్నారు. ప్రస్తుతం మండల పరిశీలన కమిటీ ఆధ్వర్యంలో ప్రతిపాదిత పాఠశాలలను సందర్శించి వివిధ అంశాలను పరిశీలిస్తున్నారు.

ఎంపికయితే రూ. 46 లక్షల చొప్పున..

డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్(యుడైస్+) సమాచారం ఆధారంగా జిల్లాలో 265 ప్రతిపాదిత పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాల నుంచి మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్ మోడ్‌లో తీసుకున్నారు. ప్రతి పాఠశాల పంపిన నివేదిక ఆధారంగా ఆ మండల పరిశీలన కమిటీ ప్రతి పాఠశాలను సందర్శించి మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు మొదలైన వివిధ అంశాలను పరిశీలిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదిత పాఠశాల వివరాలను పంపనున్నారు. కేంద్ర విద్యా శాఖ ప్రతిపాదిత పాఠశాలల వివరాలు పరిశీలించి.. అనంతరం ప్రతి మండలానికి రెండు పాఠశాలల చొప్పున ఎంపిక చేయనుంది. ఎంపికైన బడికి ప్రతియేటా రూ. 46 లక్షల చొప్పున ఐదేళ్ల వరకు నిధులు రానున్నాయి.

ఆధునిక వసతుల కల్పన

పీఎం శ్రీ యోజన కింద ఎంపికైన పాఠశాలల్లో ఆధునిక వసతులు సమకూరనున్నాయి. విద్యార్థులందరికీ టాబ్‌లు పంపిణీ చేస్తారు. అలాగే సౌర విద్యుత్తు ఏర్పాటు చేస్తారు. విద్యార్థులందరికీ సైన్స్ గణిత అధ్యాయన కిట్లను పంపిణీ చేస్తారు. అన్ని స్కూళ్లకు ఆధునిక సౌకర్యాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీ ఐసీటీ సౌకర్యం తదితర సదుపాయాలు కల్పిస్తారు. అలాగే హరిత పాఠశాల కార్యక్రమాలు చేపడతారు. అన్ని తరగతి గదులను స్మార్ట్ క్లాస్ రూంలుగా తయారు చేస్తారు. డిజిటల్ లైబ్రరీలను ప్రోత్సహిస్తారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్‌లను నిర్మిస్తారు. అలాగే విద్యార్థులకు క్రీడలు, కళలు, కమ్యూనికేషన్ టెక్నాలజీ మొదలైన వాటిలో నైపుణ్య ఆధారిత విద్య అందిస్తారు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసే విధంగా పాఠశాలలను అభివృద్ధి చేస్తారు.

❝ పాఠశాలల సంఖ్యను పెంచాలి



పీఎం శ్రీ కింద కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం శుభపరిణామం. ఈ పథకంతో ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ పాఠశాలలుగా మారన్నాయి. మండలానికి రెండు చొప్పున కాకుండా ఎక్కువ పాఠశాలలను ఎంపిక చేయాలి.

– వెంకటేశ్వర్‌గౌడ్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అభివృద్ధి చెందుతాయి



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పీఎం శ్రీ యోజన ఎంతగానో తోడ్పడుతుంది. ఐదేళ్ల కాలంలో రూ. 2 కోట్ల నుంచి 3 కోట్ల నిధులతో ఆధునిక హంగులు సమకూరి కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడే అవకాశం ఉంటుంది.

– పెంట జలంధర్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు

బీమా.. మత్స్యకారులకు ధీమా

- పీఎంఎంఎస్‌వై ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- మత్స్య సహకార సంఘాల్లో సభ్యులై ఉండాలని సూచన
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షలు వర్తింపు
- జిల్లాలో 13,800 మంది యాక్టివ్ మెంబర్లు
- ఇప్పటిదాకా మూడు వేల పైచిలుకు మాత్రమే వచ్చిన దరఖాస్తులు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : చేపల వేటను నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారులకు ప్రమాద బీమా అందించడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. వృత్తిలో భాగంగా ప్రమాదవశాత్తు నీట మునిగి, ఇతర ప్రమాదాల్లో గాని మరణించినా, అంగవైకల్యం పొందినా బీమా డబ్బులు అందేలా పథకాన్ని రూపొందించింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు మత్స్యకారులకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించింది. పథకాన్ని పొందాలంటే మత్స్యకారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సి అవసరం లేకుండా వెలుసుబాటునిచ్చింది. ఈ బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి సహకార సంఘాల్లో సభ్యులై ఉండి యాక్టివ్ మెంబర్‌గా ఉంటే చాలు. అయితే, జిల్లాలో ఈ పథకాన్ని మత్స్యకారులకు అందించడానికి మత్స్య శాఖ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. సహకార సంఘాలకు సమాచారం అందించి సభ్యులతో దరఖాస్తు చేసుకునేలా ఫారాలను అందజేశారు.

పరిహారం.. ఆరు నెలల్లోనే..

పథకం గైడ్‌లైన్స్ ప్రకారం అర్హులైన మత్స్యకారులు ఫిషరీష్ ఆఫీసర్లు ఇచ్చే ఫారంలో మెంబర్, నామినీ వివరాలు రాసి జిల్లా కార్యాలయంలో అందజేయాలి. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రాష్ట్ర శాఖకు పంపుతారు. బీమాను నమోదు చేసుకున్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం ఇవ్వనుంది. అలాగే ప్రమాదాల్లో శాశ్వత అంగవైకల్యం చెందితే వారికి రూ. 2.5 లక్షలు, ప్రమాదాల కారణంగా ఆస్పత్రిలో చేరిన మత్స్యకారులకు రూ. 25 వేలు బీమా ద్వారా రానున్నాయి. మత్స్యకారులు ఎలాంటి డబ్బులు కట్టకుండానే ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న బీమా పథకం పేద కుటుంబాలకైతే ధీమాను ఇవ్వనుంది. బీమా చేసుకున్న మత్స్యకారుడు మరణించినా, అంగవైకల్యం చెందినా, గాయాలై ఆస్పత్రిలో చేరినా వెంటనే వారి కుటుంబసభ్యులు జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.



జిల్లాలో..

జిల్లాలో ప్రస్తుతం 339 మత్స్య సహకార సంఘాలు ఉండగా, ఇందులో 21,859 మంది సభ్యులున్నాయి. కానీ యాక్టివ్ మెంబర్లుగా ఉన్న 13,800 మందికి ఈ పథకం వర్తించనుంది. ఇప్పటివరకు కేవలం 3 వేలకు పైగా మత్స్యకారులు దరఖాస్తులను జిల్లా ఆఫీసులో అందజేశారు. ఇంకా 10 వేలకు పైగా సభ్యులు దరఖాస్తులను అందజేయాల్సి ఉంది. కానీ గ్రామాల్లో ఉన్న మత్స్యకార కుటుంబాలు నిర్లక్ష్యరాసులై ఉండడంతో ప్రమాద బీమాకు దరఖాస్తు చేసుకోవాలనే విషయం కూడా వారికి తెలియడం లేదు. దరఖాస్తు ఫారాలను నింపేస్థాయిలో కూడా వారు లేరు. తద్వారా బీమా పథకం పేద మత్స్యకారులకు దూరమయ్యే అవకాశముంది. మత్స్య శాఖ అధికారులే క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తులను తీసుకోవాలని మత్స్య సహకార సంఘాలు కోరుతున్నాయి.

❝ సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులకు అమలు చేస్తున్న ఉచిత ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ఏర్పడిన మత్స్య సహకార సంఘాల్లోని సభ్యులందరూ దరఖాస్తు ఫారాలను తీసుకుని దానిని పూర్తి చేసి తిరిగి జిల్లా కార్యాలయంలో అందజేయాలి. ఫారం నింపే క్రమంలో సభ్యుడి పేరు, నామిని వివరాలు తప్పుల్లేకుండా చూసుకోవాలి.

– రాజ నర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

గ్రామస్తులు సంయమనంతో మెలగాలి



రెంజల్(బోధన్): గ్రామంలో ప్రశాంత వాతావరణం కోసం ఇరు వర్గాలు సంయమనం పాటించాలని ఎస్సై పండ్ల సాయన్న సూచించారు. మండలంలోని కందకుర్తి గ్రామంలో ఆదివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామ పెద్దలు సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ప్రతిఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దన్నారు.

కందకుర్తిలో పోలీస్ పికెట్..

కందకుర్తి గ్రామంలో శనివారం రాత్రి నుండి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఓ వర్గానికి చెందిన బాలుడు మరో వర్గానికి చెందిన ప్రార్థనా మందిరం గోడపై రాతలు రాయడంతో గ్రామంలో శనివారం వివాదం ఏర్పడింది. బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, రెంజల్ ఎస్సై సాయన్న శనివారం రాత్రి గ్రామానికి చేరుకుని ఓ వర్గం వారిని సముదాయించారు. ఆదివారం ఇరువర్గాల గ్రామ పెద్దలు చర్చించుకుంటుండగా ఎస్సై సాయన్న చేరుకుని సముదాయించారు. వివాదానికి కారణమైన బాలుడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని వివరించారు.

బ్రదర్.. పోలీస్ చెకింగ్

- పోలీసు తనిఖీల విషయాన్ని షేర్ చేసుకుంటున్న విద్యార్థులు
- వాట్సాప్ గ్రూప్‌లలో సందేశాలు
- శివారు కాలేజీల విద్యార్థుల చాటింగ్



ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీసు కమిషనరేట్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుపోతోంది. వాహనదారులు హెల్మెట్ లేకుండా వెళ్లడం, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్ ఇలా వెళ్తూ పోలీసులకు చిక్కుతున్నారు. పోలీసులకు చిక్కి ఫైన్‌లు పడ్డవారు ఎక్కువగా యువతే ఉంటున్నారు. అయితే ఇటీవల నిజామాబాద్ నగరంలో పోలీసులు నిత్యం తనిఖీలు చేస్తున్నారు. రహదారి నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు వేసి చలాన్లు కట్టాకే వాహనాన్ని ఇస్తున్నారు. అయితే కొత్తగా విద్యార్థులు పోలీసు తనిఖీలు తప్పించుకునేందుకు వాట్సాప్ గ్రూ పులను ఏర్పాటు చేసుకున్నారు. వెంటవెంటనే తనిఖీల సమాచారాన్ని వాట్సప్‌లో చేరవేసుకుంటున్నారు.

నగర శివార్లలో..

నగర శివారులో పలు ఇంజినీరింగ్, ఎంబీఏ, ఫార్మసి, డెంటల్ కాలేజీలున్నాయి. పెద్దసంఖ్యలో విద్యార్థులు కాలేజీలకు వాహనాలపై వస్తుంటారు. ఈ క్రమంలో వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు వాట్సప్ గ్రూపులను క్లాసుల వారీగా చేసుకొని గ్రూపుల్లో వాటిల్లో పోలీసుల తనిఖీలు జరిగితే వెంటనే ఈ విషయాన్ని చేరవేస్తున్నారు. ఆ వైపు వెళ్లవద్దని సూచిస్తున్నారు. గూగుల్ మ్యాప్‌లను షేర్ చేస్తున్నారు. దీంతో ఇతర విద్యార్థులు అప్రమత్తమైవారు ఆ తనిఖీల వైపు వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు. కాలేజీ ఉదయం ప్రారంభం, సాయంత్రం ఎక్కువగా పోస్టింగులు పెడుతున్నారు. మాక్లూర్ వద్ద దాస్‌నగర్, కంఠేశ్వర్ బైపాస్ వినాయక్‌నగర్, పూలాంగ్, వర్ని చౌరస్తా, మల్లారం దగ్గర చెకింగ్ అంటూ పోస్టింగ్ పెట్టి తోటి విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నారు.

దృష్టి సారించిన పోలీసులు

వాట్సాప్ గ్రూపులపై పోలీసులు దృష్టి సారించారు. క్లాసుల వారీగా ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. వారి వాట్సప్ గ్రూప్‌ల వివరాలు తెలుసుకుంటున్నారు. శివారు ప్రాంతాల్లో ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు.

మాతృభూమిపై మమకారంతో..

- ధార్మిక సేవలో తరించిపోతున్న ప్రవాసులు
- సొంతగడ్డకు ఏదైనా సాయం చేయాలని తపన
- నేడు ప్రవాసీ భారతీయ దివస్



గుమ్మిర్యాల్ శివారులో కువైట్‌లోని తెలుగువారు నిర్మించిన శ్రీకృష్ణ మందిరం

మోర్తాడ్(బాల్కొండ) : ఏ దేశమేగినా ఎందుకాలిడినా.. ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా... పొగడరా నీ తల్లి భూమి భారతిని... నిలుపరా నీ జాతి నిండు గౌరవం. ఈ గీతానికి ప్రతీకగా నిలుస్తున్నారు విదేశాల్లో నివసిస్తున్న ఎంతో మంది ప్రవాసులు. ఉద్యోగం, వ్యాపారం కోసం విదేశాలకు వెళ్లి అక్కడ స్థిరపడిన అనేక మంది మాతృభూమిపై మమకారంతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను ఉద్యమంలా కొనసాగిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఎక్కువ మంది వలస కార్మికులు గల్ఫ్ దేశాల్లోనే ఉపాధి పొందుతున్నారు. దాదాపు 60 వేల మంది గల్ఫ్‌తో పాటు మలేషియా, సింగపూర్ తదితర దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. మన జిల్లాకు చెందిన సుమారు 50 మందికి పైగా యూఏఈ, బహ్రెయిన్, ఖతర్, కువైట్, ఒమాన్ దేశాల్లో సొంతంగా వ్యాపారాలను నిర్వహిస్తుండటం విశేషం.

కన్న ఊరు రుణం తీర్చుకునేందుకు..

పుట్టిన ఊరు రుణం తీర్చుకునేందుకు చాలామంది స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. అలాగే ధార్మిక సేవల్లోనూ ముందుంటున్నారు. కువైట్‌లో శ్రీకృష్ణ సేవా సమితిని ఏర్పాటు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వలస కార్మికులు ఏడేళ్ల కింద దాదాపు రూ. 35 లక్షల వ్యయంతో గుమ్మిర్యాల్ గోదావరి తీరంలో శ్రీకృష్ణ మందిరాన్ని నిర్మించారు. బహ్రెయిన్‌లో ఉపాధి పొందుతున్న తిమ్మాపూర్ వాసులు ప్రతినెలా కొంత జమ చేసి తమ గ్రామంలో కల్యాణ మండపం నిర్మించారు. మోర్తాడ్‌లోని శ్రీవేంకటేశ్వర ఆలయం ముఖద్వారంను కూడా గల్ఫ్‌లో ఉన్న వలస కార్మికుల ఆర్థికసాయంతో నిర్మించారు. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన వలస కార్మికులు స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి తమ గ్రామంలో కష్టం వచ్చినవారికి అండగా ఉంటున్నారు. బషీరాబాద్‌కు చెందిన పోలీసు విద్యాసాగర్, పోలీసు రాధాకిషన్, పోలీసు రమేశ్‌లు గల్ఫ్ దేశాల్లో వ్యాపారం చేస్తూ తమ గ్రామంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేశారు.

పారిశుధ్య కార్మికులపై ప్రేమతో...

కమ్మర్‌పల్లికి చెందిన గుగ్గిల్ల దేవరాజ్ కొంత కాలం నుంచి ఇజ్రాయిల్‌లో ఉపాధి పొందుతున్నాడు. అతను తమ గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులపై ప్రేమతో రూ. 5 లక్షల విరాళంను ప్రకటించారు. ఈ సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేయగా వచ్చిన వడ్డీని పారిశుధ్య కార్మికులకు అందిస్తున్నారు. రోడ్డు పక్కన వృక్షాలను తొలగించగా వాటిని ఆయన తన సొంత ఖర్చుతో తిరిగి మళ్లీ నాటించారు. నీటిని సంరక్షించాలనే ఉద్దేశ్యంతో దేవరాజ్ సొంతంగాచెక్‌డ్యాంను నిర్మింపచేస్తున్నాడు. ఇప్పటికే వైకుంఠధామం వద్ద పెద్ద రాళ్లతో ముఖద్వారాన్ని, షెడ్‌ను నిర్మించారు. తన సోదరులు గణేశ్, రాజేందర్, చక్రపాణి సహకారంతో ఆయన సేవ చేస్తున్నారు.



గుగ్గిల్ల దేవరాజ్, కమ్మర్‌పల్లి(ఇజ్రాయిల్)

ఎల్లలు దాటినా సొంతూరుపై అభిమానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం దేగాం గ్రామానికి చెందిన 20 మంది ఉపాధి కోసం ఇజ్రాయిల్ వెళ్లారు. అక్కడ పలు విభాగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వారాంతపు సెలవు దినాల్లో ఒకే చోటికి చేరుకుని వారి యోగక్షేమాలతో పాటు తమ సొంత గ్రామంలో సమస్యలు, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంపై చర్చించుకునే వారు. దీంతో 17ఏళ్లుగా ఇజ్రాయిల్‌లో స్థిరపడిన సోమ రవి ఆధ్వర్యంలో దేగాం ఫౌండేషన్ ఏర్పాటు చేశారు.

గ్రామంలో వెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి రూ. లక్షా 20 వేలు ఇచ్చారు. గ్రామంలో రూ. లక్షా 30 వేలతో హనుమాన్ ఆలయ ముఖద్వారం, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు రూ. 3 లక్షల 50 వేలతో ట్రాక్టర్ కొనుగోలు చేశారు. అంత్యక్రియల కోసం రూ.2 లక్షలతో స్వర్గరథం, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెయినుద్దీన్ కుటుంబానికి రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల తండ్రి చేతిలో హత్యకు గురైన చిన్నారి కుటుంబానికి రూ. 30 వేల ఆర్థిక సాయం చేశారు.



ఇజ్రాయిల్ దేగాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన స్వర్గరథం

సేవా కార్యక్రమాలు విస్తరిస్తున్నాం..



పుట్టిన ఊరిపై మమకారంతో గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఉపాధి కోసం నాతో పాటు ఇజ్రాయిల్ వచ్చిన 20 మందితో గ్రామం పేరు మీద దేగాం ఫౌండేషన్ ఏర్పాటు చేసుకుని సేవా కార్యక్రమాలను విస్తరిస్తున్నాం. గ్రామాభివృద్ధితో పాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నాం. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించే ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమానికి ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధిగా తనకు ఆహ్వానం రావడం ఆనందంగా ఉంది.

– సోమ రవి, దేగాం, మాజీ అధ్యక్షుడు, ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్

ఊరిపైనే ప్రేమంతా..

- ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ ఎన్నారై బిగాల మహేశ్‌గుప్తా
- స్వచ్ఛంద సేవలకు విరివిగా సొంత డబ్బు ఖర్చు

మాక్లూర్ : ఆస్ట్రేలియాలో స్థిరపడ్డప్పటికీ పుట్టిన ఊరుపై ఉన్న మమకారంతో తన వంతుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు బిగాల మహేష్‌గుప్తా. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రంలోని బిగాల కృష్ణమూర్తి, సువర్ణ దంపతుల రెండవ కుమారుడు బిగాల మహేశ్‌గుప్తా. పెద్ద కుమారుడు గణేశ్‌గుప్తా ప్రస్తుతం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే కాగా రాణి, వాణి అనే ఇద్దరు తోబుట్టువులు ఉన్నారు. గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన రూ. 4.7 కోట్లతో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి బిగాల మహేష్‌గుప్తా రూ. కోటీ 40 లక్షలు విరాళం అందించారు. శ్మశానవాటికలో రూ. 20 లక్షలతో అధునాతనమైన స్నానాల గదిని నిర్మించారు. స్వర్గదామానికి అదనంగా సొంత డబ్బులు ఖర్చుపెట్టి మరింత ప్రతిష్టంగా నిర్మించారు. అలాగే రూ. 60 లక్షల వ్యయంతో గ్రామంలోని బస్టాండ్ వద్ద హన్మాన్ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న రామాలయానికి ఇప్పటికే రూ. 20 లక్షలు విరాళం అందించారు. మిగిలిన పనులను కూడా తానే పూర్తిచేయించి, విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తానని ఆయన మాటిచ్చారు.



శ్మశాన వాటికలో నిర్మించిన స్నానాల గది



ఎన్ఆర్ఐ బిగాల మహేష్‌గుప్తా

తెలంగాణ ప్రజల కల్పతరువు 'ఆట'

- సౌత్ ఆస్ట్రేలియాలో ప్రత్యేక కార్యక్రమాలు
- తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతున్న జిల్లా మహిళలు



తాటి సౌజన్య సమ్రాట్

కోటగిరి : సౌత్ ఆస్ట్రేలియాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన విద్యార్థులు, అక్కడ స్థిరపడ్డ కుటుంబాలు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు వ్యాపారస్తుల పాలిట కల్పతరువు అడిలైడ్ తెలంగాణ అసోసియేషన్ (ఆట) సంస్థ నిలుస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం వ్యక్తి వరంగల్ జిల్లా వాసి ఆదిరెడ్డి యారా ఈ సంస్థను స్థాపించగా ఈ సంస్థ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నిజామాబాద్ జిల్లా మహిళ సౌజన్య సమ్రాట్ కొనసాగుతున్నారు. అడిలైడ్ సిటీ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థలో జిల్లా మహిళలు రజిత సందీప్, ప్రీతి సతీష్ ప్రతినిధులు కావడం ప్రత్యేకత. ఆట సంస్థ తరపున కొత్తగా సౌత్ ఆస్ట్రేలియాలో అడుగు పెట్టిన విద్యార్థులు, నిరుద్యోగులకు పూర్తి గైడెన్స్ లభించడంతో పాటు వసతి సౌకర్యాల కల్పనకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలు, ఆధ్యాత్మిక కార్యకలాపాలు నిరంతరం కొనసాగిస్తున్నారు. సంక్రాంతి, ఉగాది, బతుకమ్మ, దసరా, దీపావళి తదితర పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఈ సంస్థ కృషి ఫలితంగా సౌత్ ఆస్ట్రేలియా ప్రభుత్వం హిందీ, పంజాబీ, తమిళం దారిలో తెలుగు భాషను కూడా ప్రైమరీ, సెకండరీ ఎడ్యుకేషన్ స్థాయిలో ఓ భాషా సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టడానికి ప్రతిపాదనలు తయారు చేస్తోంది. ఈ సంస్థ ప్రతినిధులు భారతీయ విద్యార్థుల సౌకర్యార్థం గుళ్లు, గోపురాలు, ఆధ్యాత్మిక, సైన్స్ పరిశోధనా కేంద్రాల నిర్మాణం కోసం వేంకటేశ్వర కల్చరల్ సొసైటీని స్థాపించింది.



అడిలైడ్‌లోని సదస్సులో పాల్గొన్న సౌజన్య తదితరులు

అపూర్వ సమ్మేళనాలు

నలభై ఏళ్ల నాటి తీపిగుర్తులతో..

బోధన్ : బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1981–83 ఇంటర్ బ్యాచ్ (బైపీసీ,ఎంపీసీ గ్రూప్స్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణ కేంద్రంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమ్మేళనం జరిగింది. నలభై ఏళ్ల క్రితం కళాశాలలో చదువుకుని వివిధ రంగాల్లో ఉన్నత స్థాయి ఎదిగి స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి తరలి వచ్చారు. అప్పటి కళాశాల ప్రిన్సిపల్ అర్లయ్య, అధ్యాపకులు నాశేశ్వరం శంకరం, కోటిరెడ్డి, క్రిష్ణారావు, సత్తయ్య, బీవీ సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి విచ్చేసి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ (హైదరాబాద్), రాష్ట్ర డైయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ పీ మోహన్ మురళి, సివిల్ ఇంజినీర్ కొనేటి విద్యాసాగర్, శ్రీలక్ష్మి, కొలంబస్, చక్రవర్తి, సీతారామయ్య, 60 మంది వరకు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



బోధన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల 1981-83 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోటగిరి జిల్లా పరిషత్ స్కూల్..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సుభాష్‌నగర్ : నగరంలోని వినాయక్‌నగర్‌లో గల పద్మశాలి సంఘంలో 1992–93లో కోటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, కుటుంబ సభ్యుల వివరాలు, యోగక్షేమాలు తెలుసుకున్నారు. మృతిచెందిన పూర్వ విద్యార్థుల ఆత్మకు శాంతికలగాలను రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంజయ్, శివకుమార్, గంగాధర్, అనిల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో సమావేశమైన 1990-91 పదోతరగతి ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు

మూడు దశాబ్దాల తర్వాత..

భిక్కనూరు : ఒక్కటి కాదు రెండు కాదు.. ఏకంగా ముప్పై ఏళ్ల అనంతరం అప్పటి స్నేహితులంతా ఒక్కచోట కలిస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలేనిది.. భిక్కనూరు మండల కేంద్రంలో ఆదివారం కార్యక్రమం జరిగింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1990–91 పదోతరగతి పూర్వ విద్యార్థినులు స్థానిక ఎస్వీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి తీపిగుర్తులను నెమరు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువుల్లో 8 మంది కాలం చేసినందున వారి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. తమ చిన్ననాటి స్నేహితురాలు అనిత మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తమకు విద్యనేర్పిన ఉపాధ్యాయులు నీలకంఠశాస్త్రి, కృష్ణమూర్తి, విష్ణుదాసును సత్కరించారు. 48 మంది పూర్వ విద్యార్థినులు తమ కుటుంబీకులతో కలిసి ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన తమ మిత్రురాలు గంప సిద్ధలక్ష్మిని సన్మానించారు. మెజీషియన్ సంతోష్ ఇంద్రజాలం ఆకట్టుకుంది. పాల్గొనేందుకు పూర్వ విద్యార్థినులు పూణె, ముంబయి, హైదరాబాద్, నాందేడ్ ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొన్నారు.

బెటాలియన్‌లో..

డిచ్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లిలో బెటాలియన్ ఏర్పాటు చేసిన 1980 నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హైదరాబాద్ ఉప్పల్‌లోని ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తోటివారి యోగక్షేమాలు, కుటుంబం, ఆరోగ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బెటాలియన్‌కు చెందిన 150 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన ఏడో బెటాలియన్‌లో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారులు, సిబ్బంది

రామేశ్వర్‌పల్లిలో..



రామేశ్వర్‌పల్లిలో సమావేశమైన భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాల 1996-97 విద్యార్థులు

భిక్కనూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1996–97 పదోతరగతి పూర్వ విద్యార్థులు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సమావేశమై 25ఏండ్ల సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులు రాములు, నర్సయ్య, నాగభూషణంగౌడ్, జే.ప్రతాప్ రెడ్డి, రామదాసు, బాల్ నర్సయ్య, కాశీనాథ్ శర్మ, సుదర్శన్ గౌడ్, యాదగిరి, లింగంను ఘనంగా సత్కరించారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు.

1996-97 బ్యాచ్ విద్యార్థులు..

నిజామాబాద్ అర్బన్ : 1996–97 పదవతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోరి ఓ ప్రైవేట్ హోటల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నగరంలో వివేకానంద పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు సరదాగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సమంత, రవికాంత్, శ్రీకాంత్, రవీందర్, నారాయణ, ప్రేమలత, వెంకటేశ్వర్ శంకర్, నర్సయ్య, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృత్యువాత

పిట్లం(జుక్కల్): మండలంలోని గౌరారం గ్రామం ఊర చెరువులో పడి జీపీ కార్మికుడు పందిరి సవీన్ (26) మృతి చెందిన సంఘటన ఒకటి చోటుచేసుకుంది. ఏఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న పందిరి సవీన్ గ్రామంలో పని ముగించుకుని ఊర చెరువుకు కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. ఆసమయంలో ఎవరూ అక్కడ లేరు. ఆదివారం ఉదయం గౌరారానికి చెందిన జీపీ ఎలక్ట్రీషియన్ ఊర చెరువులోని జీపీ మోటార్ స్టార్ట్ చేద్దామని చెరువు వద్దకు వెళ్లగా చెరువు నీటిలో సవీన్ మృతదేహాన్ని చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి ఏడాది క్రితమే పెళ్లయిందన్నారు.

జుక్రాన్‌పల్లిలో..

జుక్రాన్‌పల్లి : జుక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండలో పసుల మల్లు(55) అనే మహిళ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మల్లు మానసిక పరిస్థితి బాగా లేదన్నారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ఉంటుందన్నారు. గ్రామ శివారులోని మద్ది కుంట చెరువులో పడి మల్లు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఆమె కుమారుడు పసుల సుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి..

కామారెడ్డి క్రైం : రైలులో నుంచి జారిపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కామారెడ్డికి సమీపంలోని నర్సన్నపల్లి సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు నర్సన్నపల్లి వద్దకు రాగానే రైలు ఎక్కే తరపు వద్ద నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుని వద్ద లభించిన టికెట్ ఆధారంగా అతడు హైదరాబాద్ మల్కాజ్‌గిరి నుంచి నుంచి కామారెడ్డికి ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. మృతుని వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై తావు నాయక్ తెలిపారు. ఎవరైనా అతడిని గుర్తిస్తే కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

క్రైం కార్నర్

బైక్ దగ్ధం



కాలిపోయిన బైక్

భిక్కనూరు : మండల కేంద్రంలోని గిద్దదళితవాడలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను ఆదివారం వేకువజామున దగ్ధం చేశారు. గిద్ద దళితవాడలో నివాసముంటున్న పొట్టిగిని మైసయ్య శనివారం రాత్రి తన ఇంటి ముందు తన బైక్‌ను నిలిపి ఉంచాడు. ఆదివారం వేకువజామున బైక్ దగ్ధమవడాన్ని చూసిన చుట్టుపక్కల వారు కేకలు వేయగా మైసయ్య బయటకు వచ్చి మంటలు ఆర్పేశాడు. అప్పటికే బైక్ పూర్తిగా దగ్ధమైంది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఆనంద్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో చోరీ

రాజంపేట : రాజంపేట మండలంలోని స్థానిక సాయిబాబా ఆలయం, పెద్దమ్మ ఆలయం, ఎల్లమ్మ ఆలయాల్లో శనివారం అర్ధరాత్రి దుండగులు వరుస చోరీలకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం ఆలయ సేవలకు తమతమ దేవాలయాలకు వెళ్లి చూడగా ఆలయ తాళాలు ధ్వంసమై కనిపించాయి. దీంతో ఆలయ సేవకులు తమ కమిటీ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసుసిబ్బంది సాంకేతిక సహాయంతో కొద్ది గంటల్లోనే నిందితున్ని పట్టుకున్నారు. అతడు శివాయిపల్లి గ్రామస్తుడని, నిందితుడి దగ్గర రూ.1500 నగదు మాత్రమే పట్టుబడినట్లు ఎస్సై రాజు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.



సీసీ ఫుటేజీలో నిందితుడి ఫొటో